# పెద బొండాయి

మూడుమొగాల నరిశిగాడు నాకన్న ఆర్నెల్లు సీనియరు. కంపెనీ పుట్టినప్పట్నుంచీ కంపెనీ కనిపెట్టుకున్నాడు. కొంచెం తమాసా మనిసి. రోసంతో ఏందైనా మాట్టాడుతుంటే మూడుమొగాలతో మాట్టాడుతాడు. మేమంతా ఆడ్ని మూడుమొగాలనే పిలుస్తాం.

కల్వీన్ ఓటలులో కూకున్నాం మేం ముగ్గురం. మూడోవాడు యారను కున్నారేం? నక్కాయిగాడే. అడ్ని నక్కాయని యెందుకు పిలుత్తాం అంటే, ఆ కత తరువాత సెపుతాలే!

"పెదబొండాయిగాడికి దునియాలో సంగతులన్నీ తెలుసు" అన్నాడు మూడు మొగాలు. అంటూ లైంజూసు తాగేసిన గలాసు తలకిందులుగా పెట్టాడు. మాట్టాడకుండా మేంగూడా మా గలాసులు తలకిందులుచేశాం.

"పెదబొండాయి చినబొండాయిలసంగతి ఇదివరకు సెప్పాను గాదురా అబ్బాయిగారి సుబ్బాయి?" అని నన్ను సూసి అన్నాడు మూడుమొగాలు.

నా కబ్బాయిగారి సుబ్బాయని పేరెందు కొచ్చిందో అదీ సెపుతాలే ఓనాడు.

మూడు మొగాలు కుర్సీమీద సేరగిల్లాడు. నత్తగువ్వలల్లే కళ్ళు పెట్టి ఆలోసిత్తూ కూకున్నాడు.

"పెదబొండాయి సంగతేందిరా—మిలిటరీలో సేరి ఎన్నాళ్ళున్నాడ్రా" అని పుల్లేశాను.

వాడేం మాట్లాడ్డే! వేళ్ళతో బల్లమీద తబ్లావాయిత్తా "సిన్నపరెడ్డి బంగారుకడ్డీ" పాట యీలతో పాడుతూ కర్నాలపాటి డొంకలోంచి ఇంటి కెళ్ళుతున్నాడి మాదిరిగా కళ్ళెగరేత్తుంటే బమ్మపుత్తర కద్దరి ఉన్నాం అని మరిసిపోయాం. కదంతొక్కటంలో కుమ్మరిగాడిదనిగాని పదం పాట్టంలో పట్నంసాని పక్కపాటగాడ్నిగాని మించేత్తాడు మూడు మొగాల్. మేం గూడా యనకాల సారగిలబడి ఊకొడుతూ ఊరకున్నాం. ఓటల్‌లో ఓళ్ళిద్దరు మావంక చూత్తూ కళ్ళెగరేశారు. బైట లారీ ఒక టాగింది. డ్రైవరు మాణిక్యం సరాసరి లోపలికొచ్చి "ఏక్ కప్ చా" అంటూ మూల బల్లమీద

సతికిలబడ్డాడు. మాతో మాట్లాడే- ఓటలాయన కుక్క, మూడుమొగాలపాట యింటూ అదో మాదిరిగా పెట్టింది మొగం. దాని కళ్ళల్లో మూడు మొగాల గాడు ముప్పైమొగాల గాడల్లే కనబడ్డాడేమో.

దడాలున పాట ఆపాడు. మూడు మొగాల మొగం ముక్కాలు మొగం అయింది. ఓరగా సూత్తా "దాగం యేత్తుండదిరా" అన్నాడు.

"లైమ్‌జూసు సెప్పనంట్రా" అన్నాను నేను.

"నీ లైముజూ సెవరికోయి పోదాంపా, * ఖాసియాషాపుకు" అన్నాడు మూడు మొగాలు.

ఖాసియాషాపులో యెనకయేపున గోనెవట్టాలమీద కూకున్నాం. ముందర రెండుబుడ్లు, మూడు మట్టిగలాసులు తెచ్చిపెట్టింది ఖాసియాముసల్ది కలాంచి. కలాంచి కాంచి తల్లి. ఆళ్ళిద్దరి సంగతీ తర్వాత సెప్తా.

ఒక బుడ్డి కాలీ సేశాం. లయను సిగరెట్టు ఎలిగించా నేను. "ఆడి మొగం రాసన్ సిగరెట్టు ఎవడిక్కావాల్రా" అంటూ, "ఒసేయి కాంచీ ఏక్ విల్సు ప్యాకెట్ లావ్" అని డబ్బు లిచ్చాడు మూడు మొగాలు— మా ఓసీ ఆడర్లీ రూములో అట్టాంటి గొంతుతోనే డబాయిత్తాడు.

రెండోబుడ్డిలో సగం పంచాం. మూడోబుడ్డి ఆడేరుచేశాం.

"పద్దాలుగేండ్లున్నాడురా మిలిటరీలో" అన్నాడు మూడుమొగాలు— చిగరెట్లు పొగ ఊత్తూ.

"పద్దాలుగేం డ్లెవడురా—ఏందిరా" అన్నాడు నక్కాయి—మిగతా అరబుడ్డీ ఒక్కమారే పోసుకుంటూ.

---

* ఖాసీలు అస్సాములో షిల్లాంగు ప్రాంతాల ఒకజాతి. ఇటీవల చాలా పనికొస్తున్నారు.

మూడో బుడ్డి వచ్చింది. కాంచి పెంపుడుపిల్లి నక్కాయిగాడిజేబులో చాపటిన్ను నాకుతూ 'దునియా అచ్చాహై' అన్నట్టుగా సూత్తోంది.

"పెదబొండాయిగాడు మిలిటరీలో ఎన్నాళ్ళున్నాడ్రా అని అడగలే దంట్రా అబ్బాయిగారి సుబ్బాయి," అన్నాడు మూడుమొగాలు.

"హా ! ఓహో' విజమేరా! అసలు ఆడిసంగతే సెప్పుకుంటూ సెప్పు కుంటూ ఏరే యవారంలోకి దిగాం. సరే చెప్పరా!" అన్నాను నేను.

మూడోబుడ్డి ముగ్గురు గలాసుల్లో ఓడ్చేసి ఉంకోబుడ్డి ఆడేరువేశాం.

"కానీరా—పెదబొండాయి సంగతేందిరా—దంచై రా—"అన్నాడు నక్కాయి—ఆడి మూతి పగిలిన మాతేడుపండల్లే ఉంది.

"పట్లు తెలీకుండా కుస్తీ పట్టకూడదోయి అనేవోడు పెదబొండాయి గాడు" అంటూ బుజాలు సూసుకున్నాడు మూడుమొగాలు.

"పట్లు తెలీకుండా కుస్తీపడితే తటాల్న అవతలాడి సేతుల్లో సిక్కిపోతాం—అట్టాగే జాగొర్తగా లేకపోతే మిలిటరీలో గూడా సిక్కిపోతాం. సిపాయి దర్జాపోతుంది" అనేవోడు పెదబొండాయి ఆ రోజుల్లో.

"లాన్సునాయకు దవడం అదీ మొదటి సూసెన— సన్నిపాతంలో సూసెనంటిది" అన్నాడు.

"సిక్కురిపోర్టు తీసుకెళ్ళడానికి,దానికీ దీనికీ లాన్సు నాయకు ల్లేకపోతే ఎట్టారా" అన్నాను నేను.

"అస్సాంలో నక్కదోసకాయలు లేవురా" అన్నాడు నక్కాయి.వాడి జేబులోంచి ఒక చాప టిన్ను తీసి కటకటా నములుతున్నది మూలగా పిల్లి—

ఆ వాసనకు ఉదిరేకం వచ్చినోడల్లే రెండో జేబులోంచి నాలుగు టిన్నులుతీసి ఊడగొట్టి ముందెట్టాడు.

కమ్మనివాసన గుమ్మెత్తిపోతోంది. ఒక్కక్క పే నములుతున్నాం.

'నిజానికి సూడరా' అన్నాడు మూడుమొగాలు. "లాన్సునాయకు లేక పోతే ఎవర్లోంచి నాయకుల్ని సేస్తారు? అర్థమయిందా? నిజమా కాదురా?"

"ఊ—నీ....నిజమేరా!" అన్నాను నేను.

"అంటే ఉంకోమాట సెప్తా సూడు. నాయకు లేకపోతే హవల్దార్ల నెట్లా సేస్తారు? అట్లా అట్లా పైదాకా అంతేగా? ఆ యవారం అంతా పెదబొండాయిగాడికి తెలుసు—పద్దాలుగేండ్లు సలీసులోపల సిపాయి దర్జా వొదిలెట్టలే ఆడు! పొమోషన్ పుచ్చుకోకూడదని శాసనం కట్టుకున్నాడురా. పొమోషన్ అంటే అసయ్యం. అంతకన్న అసయ్యం ఎర్రపట్టీ ఎం. పీ! లంటే."

"ఎర్రపట్టీ 'ఎంపీ' లంటే ఎండ్రకాయ లంటోళ్ళురా"అనేవోడు పెద బొండాయి. ఈమాట సెపుతూ త్రేన్చాడు మూడు మొగాలగాడు—తుమ్మేడు నక్కాయిగాడు—గూడయదవలు! బుడ్లన్నీ అయిపాయాయి. రెండు చాప టిన్నులు మాత్రం మిగిలాయి. ఒకదాన్లో ముక్కెత్తుకుంటూ బుసవొదిలాను.

'అందర్ క్యాహై? కుత్ కుత్తా మరాహువా హై క్యా? క్యారే ఓ బాసన్?' అంటూ బైట్నుంచి ఎవడో మా దగ్గిరి కొచ్చాడు.

ఆడి సేతిసుట్టూ ఎర్రపట్టీ ఉంది. 'ఆడి తల్లిపాలు రాబందులు పీక. ఆడు ఎంపీ గాడు.'

ఆడ్ని సూడంగానే 'ఒరెయి పెద బొండాయిరా. ఎంపీల్లోకి ఎప్పుడు పోయావురా' అన్నాడు మూడుమొగాలు.

'ఎంపీ అయితేనేం మనోడేగా' అని మా పాణాలు పాణాల్లో కొచ్చాయి.

"పెదబొండాయి! గిద బొండాయినై -ఆర్మీ బాస ఉర్దూ—తెలుచా—ఈ స్తలం అవుటా బవున్డు" అన్నాడు, పెదబొండాయి—"ఆడికతే ఇందాకట్నుంచీ ఇంటున్నాం అనే ఇస్వాసం గూడా లేదు—ఎర్రకొమ్ముకత్తే ఎద్దుగ్గూడా ఏదో కొండమీద ఉన్నట్టుంటుంది గామాల్రా !"

ఏడ్చావులేరా అంటూ మిగిలిన చాపటిన్నులు రెండు రెండు చేతుల్లో పట్టుకుని పెదబొండాయి దగ్గరికిపోయాడు— బావమరిది దగ్గిరి కెళ్ళినట్టుగా మూడు మొగాలగాడు.

'ఉర్దూమే బాత్ చిత్ కరో'అంటూ పెదబొండాయిగాడు పైట మొగమెట్టి "నాయక్ హంస్సేనుసాబ్ ! ఏ ఆద్మీకో అరెస్టు కర్నా !" అని పైట ఎవర్నో పలకరించాడు.

'ఓరి జపాను తొత్తుకొడకా' అంటూ ఆడి మొగంమీద ఒకటి వీపుమీద ఒకటీ చాపటిన్నులు విసిరికొట్టేడు గ్రెనేడు బాంబులల్లే — మూడు మొగాలగాడు.

అదే సందుగా ఎనకనుంచి ఎనగ్గా వరుగెత్తాం.

నా కాల్లో ఏదో గుచ్చుకుంది. కుంటుకుంటూపోయి మూలతిరుగుడున షాపు ఎనకాల నక్కున్నా.

ముందరగా రోడ్డుమీద విజిలేత్తూ పరుగెత్తాడు పెదబొండాయి. ఆడ్నిచూత్తే తిమింగిలం గుడ్డులోంచి పగుల్చుకొచ్చాడా ఏంటి అన్నట్టున్నాడు. రోడ్డంతా ఆడిమీది వాసనే!

• పక్కగల్లీలోంచి పరుగో పరుగు నేను. ముల్లువాచి పెదబొండాయిగాడి గుండెంతలావై నాసరే— ఎంపీగాడు ఎంటడుతుంటే యెనక్కి తిరిగి సూడగూడదురా!